# గొప్ప సంస్కర్త
## (ఎజ్రా గ్రంథం సంగ్రహ సమీక్ష)

**A. ఉపోద్ఘాతము :** మానవుల పట్ల దేవుని ఉద్దేశాల నెరవేర్పు కొన్నిసార్లు ఆలస్యంగా జరుగవచ్చునుకాని అవి ఏ మాత్రం విస్మరించబడవు అనే దానికి నిదర్శనం ఎజ్రా మరియు నెహెమ్యా గ్రంథాలు. దేవునిచే ఏర్పరచుకోబడిన ప్రజలు బబులోను చెర నుండి తిరిగి వచ్చిన ఉదాంతాన్ని ఈ రెండు గ్రంథాలు తెలియజేస్తాయి.

**1. గ్రంథకర్త :** ఈ గ్రంథాన్ని ధర్మశాస్త్ర ప్రవీణుడైన ఎజ్రా శాస్త్రి వ్రాసాడు. ఎజ్రా లేవీ గోత్రికుడు. యోషియా కాలంలో ధర్మశాస్త్ర ప్రతిని దేవుని మందిరంలో కనుగొన్న హిల్కియా (II ది.వృ. 34:14) సంతతికి చెందినవాడు. అతని తండ్రి పేరు శెరాయా. ఇతడు శిథిలావస్థలో ఉన్న దేవుని మందిరాన్ని తిరిగి కట్టేందుకు బబులోను నుండి యెరూషలేము పట్టణానికి వచ్చిన యాజకులలో ఒకడు. (ఎజ్రా 7:1-7,11). ఎజ్రా అనే హెబ్రీ పదానికి యెహోవా సహాయము చేయును అని అర్థం.

**2. కాలము :** క్రీ. పూ. 457-444 సం॥లో ఎజ్రా గ్రంథం వ్రాయబడింది. మూలభాషయైన హెబ్రీ భాషలో ఎజ్రా, నెహెమ్యాలు ఒకే గ్రంథంగా ఉండేవి. గ్రీకు అనువాద పాత నిబంధనలో కూడ ఒకే గ్రంథంగా ఉన్నాయి. కాలక్రమేణ రెండు గ్రంథాలుగా విభజించబడ్డాయి.

**3. సందర్భము :** యూదులు బబులోను చెర నుండి యెరూషలేముకు తిరిగి రావడం, మందిరాన్ని పునర్నించిన విధానం ఈ గ్రంథం తెలియజేస్తుంది. దేవుని పనికి ఎన్ని ఆటంకాలు ఎదురైనా ఆ పనిని పూర్తి చేయాలనేదే ఈ గ్రంథంలోని సందేశం. ఎజ్రా నెహెమ్యా గ్రంథాలలో క్రీస్తు మనల్ని సమకూర్చే వానిగా కనిపిస్తాడు.

**4. చరిత్ర :** బబులోను చెర కాలంలో యిర్మీయా, యెహెజ్కేలు ప్రవక్తలు యూదుల సమకూర్పును గూర్చి ప్రవచించారు. వారు 70 సం॥ల తరువాత తిరిగి తమ స్వదేశానికి వస్తారని యెరూషలేమును పునర్నిర్మిస్తారని యిర్మీయా చెప్పాడు (యిర్మీ 29:10).

మొదట ఉత్తర ఇశ్రాయేలు తరువాత దక్షిణ రాజ్యమైన యూదా చెరకు వెళ్ళినట్లు రాజుల గ్రంథాలు తెలియజేస్తున్నాయి. దక్షిణ రాజ్యం చెరకు వెళ్ళినప్పుడు దానియేలు కొనిపోబడ్డాడు. ఇశ్రాయేలు జాతి పునర్నిర్మించబడడానికి 100 సం॥ల కాలం పట్టింది. అందులో రెండు కాలాలు చాల ప్రాముఖ్యమైనవి.

అ) క్రీ. పూ. 537-517 సం॥ వరకు గల 20 సం॥ల కాలం : కోరెషు రాజు పాలన మొదటి సంవత్సరం నుండి, దర్యావేషు పాలన 6వ సంవత్సరం వరకు గవర్నరైన జెరుబ్బాబెలు మరియు యాజకుడైన యెహోషువ ఆధ్వర్యంలో మందిర నిర్మాణం జరిగింది. ఈ కాలంలోని

విషయాలను అర్థం చేసికోవాలంటే ఎజ్రా 1-6 అధ్యా, హగ్గయి మరియు జెకర్యా గ్రంథాలు చదవండి. ఆలాగే I దిన వృత్తాంతాలు మొదటి అధ్యాయం, II దినవృత్తాంతాలు చివరి రెండు వచనాలు, 126, 137వ కీర్తన చదవండి.

ఆ) క్రీ.పూ. 458-433 వరకు గల 25 సం॥ల కాలం : ఈ కాలంలో నెహెమ్యా, యాజకుడైన ఎజ్రా యెరూషలేము ప్రాకారాన్ని పునర్నిర్మించారు. ఈ కాలంలో మలాకి ప్రవక్తగా ఉన్నాడు ఎజ్రా గ్రంథంలో ఈ రెండు కాలాలను గూర్చి వ్రాయబడింది. నెహెమ్యా గ్రంథంలో రెండవ కాలం గూర్చి అనగా ప్రాకార నిర్మాణాన్ని గూర్చి మాత్రమే వ్రాయబడింది.

**5. గ్రంథ విశిష్టత :** ఎజ్రా మరియు నెహెమ్యా గ్రంథాలు రెండు కూడ పారసీక రాజుల ఆజ్ఞతో ఆరంభమౌతాయి. రెండు గ్రంథాల ముఖ్యాంశం నిర్మాణం. రెండు గ్రంథాలలోను ఇద్దరు నాయకుల పశ్చాత్తాపంతో కూడిన దీర్ఘప్రార్థనలున్నాయి. రెండు గ్రంథాలు కూడ దేవుని ప్రజల శుద్ధీకరణతో ముగించబడ్డాయి.

దేవుని ప్రజలు దేవుని పనిని చెయ్యడానికి ఇష్టపడితే దేవుడు వారి ద్వారా అన్ని కాలాలలోను తన కార్యాన్ని జరిగిస్తాడని ఈ గ్రంథాలు తెలియజేస్తున్నాయి. ఈ రెండు గ్రంథాలు కూడ వాటిలోని దైవజనుల జీవితాల్ని కేంద్రంగా చేసికొన్నాయి.

రెండు గ్రంథాలు కూడ నాయకత్వాన్ని గూర్చిన రెండు అధ్యయనాలు అని చెప్పవచ్చును. దేవుడు ఈ భూమ్మీద తన కార్యాలు చేయడానికి ఏలాంటి నాయకులు కావాలో ఈ గ్రంథాలు తెలియజేస్తున్నాయి. ఎజ్రాగ్రంథంలో దేవుని నియమాలు, సూత్రాలు, నమూనాలు మరియు పద్ధతులు ఉన్నాయి. నెహెమ్యాలో నాయకత్వపు లక్షణాలున్నాయి. రెండు గ్రంథాలలోను దైవ కార్య నెరవేర్పు కొరకు అన్య రాజుల అనుమతి, సహకారం కనిపిస్తుంది. ఆలాగే దేవుని వాక్యాన్ని చదవడం వలన కలిగే ఉజ్జీవం గూర్చి, దానికి మూలమైన ఆధ్యాత్మిక నాయకత్వాన్ని గూర్చి వ్రాయబడింది. ఒక్కమాటలో చెప్పాలంటే ఈ జంట గ్రంథాలను పాత నిబంధన సమదృక్పథ సువార్తలు అని చెప్పవచ్చును. రెండింటి నిర్మాణం, విషయ సంగ్రహం ఒకే రీతిగా ఉన్నాయి.

దినవృత్తాంతాల గ్రంథాల లాగ ఈ రెండు గ్రంథాలు కూడ దేవుడు ఏర్పరచుకొన్న ఇశ్రాయేలు జాతి ఇరుపార్శ్వాలను చూపిస్తాయి. శాస్త్రిగా, యాజకునిగా ఎజ్రా దేవుని వాక్యం ద్వారా బలిపీఠం, మందిరం పని చేసాడు, నెహెమ్యా రాజకీయ వేత్తగా అర్చకేతరునిగా ప్రాకార నిర్మాణం చేసాడు. ఇద్దరు భిన్నమైన నాయకులైనా వారి పనిలో భిన్నత్వం లేదు. ఒకరికొరకు సహాయకులుగా ఉన్నారు. దినవృత్తాంతాల గ్రంథం ఓటమి మరియు నిరాశతో ముగించబడింది. కాని ఎజ్రా నెహెమ్యా గ్రంథాలు హృదయాన్ని దిట్టపరచాయి. పునరుద్ధరణ, పునర్నిర్మాణం, ఉజ్జీవం వీటి మూలాంశం. ఇవన్నీ ఇశ్రాయేలును మరో పాత్రగా రూపొందిచేందుకే సంకల్పించబడ్డాయి. (యిర్మీ 18:1-8).

## B. గ్రంథ విభజన :

### I. జెరుబ్బాబెలు నాయకత్వంలో ప్రజలు తిరిగివచ్చుట (1-6 అధ్యా).

1. దేవాలయ పునర్నిర్మాణం నిమిత్తం కోరెషు ఆజ్ఞ - 1 అధ్యా.
2. జెరుబ్బాబెలుతో తిరిగి వచ్చుట - 2 అధ్యా.
3. మందిర పునర్నిర్మాణం - 3 అధ్యా.
4. ఆటంకాల వలన నిర్మాణం ఆగిపోవుట - 4 అధ్యా (అర్తహషస్త ఆజ్ఞ).
5. పునర్నిర్మాణం తిరిగి కొనసాగించబడుట - 5,6 అధ్యా (దర్యావేషు ఆజ్ఞ).

### II. ఎజ్రా నాయకత్వంలో ప్రజలు బబులోను నుండి తిరిగి వచ్చుట (7-10 అధ్యా).

1. ఎజ్రాతో తిరిగి వచ్చుట 7,8 అధ్యా.
2. ఎజ్రా జరిగించిన గొప్ప సంస్కరణ 9,10 అధ్యా.

## C. అంశాల వారిగా సంక్షిప్త వివరణ :

### I. బబులోను చెర నుండి యూదుల విడుదల (1:1-6 అధ్యా).

1. **గత చరిత్ర :** యూదా చివరి రాజైన సిద్కియా క్రీ. పూ. 597 లో బబులోనుకు తీసికొనిపోబడ్డాడు. క్రీ. పూ. 586 సం॥ జూలై 18వ తేదీ యెరూషలేము పట్టణం నాశనం చేయబడింది. మందిరం కాల్చివేయబడింది. (II రాజు 24 అధ్యా). క్రీ. పూ. 539 అక్టోబర్ 29వ తేదీన కోరెషు ఆధ్వర్యంలో మాదీయులు మరియు పారసీకులు చేసిన దాడిలో బబులోను కూలిపోయింది. కోరెషు బబులోనుపై మాదీయుడైన దర్యావేషును నియమించాడు. కోరెషు పాలనలో మొదటి సంవత్సరం అనగా క్రీ. పూ. 538 సం॥ యూదులు యెరూషలేముకు తిరిగి వెళ్ళి మందిరాన్ని పునర్నిర్మించుకోవచ్చునని ఆజ్ఞ ఇచ్చాడు. ఆ ఆజ్ఞతో ఎజ్రా గ్రంథంలోని చరిత్ర ప్రారంభించబడింది. కోరెషు యూదులు తిరిగి వెళ్ళేందుకు అనుమతించడమే కాక, అందుకు కావలసిన బంగారం, వెండి, ఇతర సామాగ్రిని ధారాళంగా ఇవ్వాల్సిందిగా తన జనులకు ఆజ్ఞ ఇచ్చాడు. అంతేకాదు నెబుకద్నెజరు యెరూషలేము నుండి తెచ్చిన దేవుని మందిర ఉపకరణాలన్నిటిని తిరిగి ఇవ్వాల్సిందిగా ఆజ్ఞాపించాడు (1:6-8) దేవుని మందిర ఉపకరణాలన్నిటిని భద్రం చేసేందుకు దేవుడు బబులోను ఖజానాను వాడుకొన్నాడు. ఈ ఆజ్ఞతో యూదా చరిత్రలో, యూదుల జీవితాల్లో క్రొత్త అధ్యాయం ప్రారంభమైంది.
2. **జెరుబ్బాబెలు, నాయకత్వంలో తిరిగి వచ్చిన యూదులు :** క్రీ. పూ. 537 సం॥ జెరుబ్బాబెలు మరియు యెహోషువ నాయకత్వంలో 50,000 మంది బబులోను నుండి 4 నెలలు ప్రయాణం చేసి యెరూషలేముకు వచ్చారు. దేవునిచే ప్రేరేపించబడినవారు దైవ భక్తి గల

వారందరూ వెళ్ళారు. చెర సమయంలో ఉన్నత వర్గంవారే కొనిపోబడ్డారు. (యిర్మీ 24:5-8; 44:15). ఇప్పుడు కూడ అందరు తిరిగి రాలేదు. 70 సం॥ల చెర కాలంలో బబులోనులో ఇళ్లు కట్టుకొని స్థిరపడిన యూదులు అనేకులు అక్కడనే నిలిచిపోయారు.

ప్రియులారా! ఒక్కడ ఒక విషయాన్ని ఆలోచిద్దాం. ఈనాడు ప్రపంచ వ్యాప్తంగా ఆయా దేశాలలో చెదరిపోయిన యూదులు తిరిగి ఇశ్రాయేలు దేశంలో సమకూర్చబడే సమయం వచ్చినప్పుడు ఎంతమంది తమ స్థిరచరాస్తులను వదలి పెట్టి వస్తారు? వారు యెరూషలేములో తిరిగి క్రొత్తగా జీవితాన్ని ప్రారంభించేందుకు ఇష్టపడతారా? విశ్వాసులమైన మనల్ని ప్రభువు అన్ని వదలి ఫలానా స్థలానికి వెళ్ళమంటే ఎంత మంది వెళ్తారు ?

తిరిగి వెళ్ళిన వారిలో యూదా, బెన్యామీను, లేవీ గోత్రికులే పేర్కొన బడినా 12 గోత్రాల వారు వెళ్ళినట్లు వాక్యాధారంగా చెప్పవచ్చు. (II దిన 11:13-17; మత్త 10:6; 4:13,15; లూకా 2:36; అపో 26:7).

ఇశ్రాయేలు జాతి మొదటి నిర్గమము ఐగుప్తుకు సంబంధించిన రెండవది బబులోనుకు సంబంధించినది. ఇప్పుడు మోషే స్థానంలో ఎజ్రా ఉన్నాడు. అతడు మోషేలాగ మంచి రచయిత, నాయకుడు, వీరిద్దరు గొప్ప కార్యనిర్వాహకులు, ధర్మశాస్త్రాన్ని ఇచ్చినవారు మరియు బోధించినవారు. ఇద్దరు కూడ దేవుని కృపాసంకల్పాన్ని నెరవేర్చేందుకు అనగా బంధకాల్లో ఉన్న ఇశ్రాయేలును విడిపించేందుకు ఏర్పరచుకొనబడినవారు. ఇద్దరూ దేవుని ప్రజలను వారి దేశానికి చేర్చారు. యెరూషలేము దేవుని పట్టణం. తన ప్రజల పాపాన్ని బట్టి దాని నాశనానికి అనుమతించినా అది ఇంకా ఆయన పట్టణంగానే ఉంది. ఆయన తన ప్రజలను తిరిగి సమకూర్చాడు తిరిగి సీయోనును పునరుద్ధరించాడు.

3. **ప్రవచన నెరవేర్పు :** ఇవన్నీ కూడ దేవుని ప్రవచన నెరవేర్పుగా ఆయన చెప్పిన కాలంలోనే జరిగాయి. వారిని తిరిగి రప్పిస్తానని చెరకు 200 సం॥ క్రితమే ఆయన వాగ్దానం చేసాడు. అందుకు తాను ఎవరిని వాడుకోబోతున్నాడో ఆ కోరెషు పేరును కూడ అతడు పుట్టక ముందే తెలియజేసాడు. (యెష 44:28; 45:1-4). బహుశా కోరెషు తనను గూర్చి వ్రాయబడిన మాటలను బట్టే అట్టి ఆజ్ఞను జారీ చేసి ఉండవచ్చును. ఏది ఏమైనా కోరేషు దేవుని సార్వ భౌమాధికారాన్ని గుర్తించాడు. రాజు ఇచ్చిన ఆజ్ఞ ప్రతిని బహుశా దానియేలు వ్రాసి ఉండవచ్చును.

**II. మందిర నిర్మాణం :** తిరిగి వచ్చిన యూదుల పేర్లు ఎజ్రా 2వ అధ్యాయంలో వ్రాయబడ్డాయి. వారు తిరిగి వచ్చాక చేసిన మొదటి పని మందిరానికి పునాది వేయుట. వారి గృహాల కంటె ముందుగా మందిరాన్ని నిర్మించాలనుకోవడం గొప్ప సంగతి, మందిరానికి పునాది వేయక ముందే మొదట బలిపీఠాన్ని నిర్మాంచారు (3:2). విశ్వాసి దేవునితో సరైన సంబంధం కలిగి ఉండాలంటే చెడిపోయిన సంబంధాన్ని పునరుద్ధరించుకోవాలంటే మొదట పాప

నివారణను గూర్చి శ్రద్ధ వహించాలి. దేవుడు మనిషిని దీవించాలంటే అతని హృదయం సరిగా ఉండాలి. బలిపీఠం యూదా మతానికి కేంద్రం. సిలువ క్రైస్తవ విశ్వాసానికి కేంద్రం. అది జీవితాల్ని పునరుద్ధరిస్తుంది. దేవుని కార్యాలను చేసేందుకు పురికొల్పుతుంది.

**1. ఆటంకాలు :** యూదులు చేపట్టిన మంచి కార్యానికి ఎదురైన ఆటంకాలను గూర్చి 4:1-22 లో వ్రాయబడి ఉంది. సాతాను పలు విధాలుగా ఆటంకాలు కలిగిస్తూ వచ్చాడు.

**అ. రాజీతత్వం :** యూదులు బబులోను చెరకు వెళ్ళాక, యెరూషలేమును నివాసంగా చేసికొన్న అన్యజనులనేకులు యూదులకు మందిర నిర్మాణంలో సహాయం చేస్తామన్నారు (4:1-2). కాని యూదుల పెద్దలు దేవుని కొరకు ఖచ్చితమైన నిర్ణయం తీసికొన్నారు. మా దేవుని మందిరాన్ని మేమే నిర్మిస్తామని అన్నారు. దాంతో సమస్యలు ప్రారంభమయ్యాయి (4:3-4) ప్రియులారా దేవుని కొరకు చేసే ఏ పనికైనా ఆటంకాలు తప్పకుండా వస్తాయి. అయితే సంఘం లోకం సహాయాన్ని అడుగ కూడదు.

**ఆ. పని నిల్పివేయబడుట :** యెరూషలేములోని అన్యులు రాజ దర్బారులో ఉన్న అధికారులకు లంచాలిచ్చి మందిర నిర్మాణానికి కావల్సిన సామాగ్రి అందకుండ చేసారు. క్రీ. పూ. 530 సంవత్సరం కోరెషు చక్రవర్తి మరణానంతరం కంబిసెన్ చక్రవర్తి అధికారంలోనికి వచ్చాడు. తరువాత అర్తహషస్త పర్షియాకు రాజయ్యాడు. ఈకాలమంతటిలో కూడ మందిరపు పని చాల నెమ్మదిగా జరిగింది. అన్యులు మరియు లంచగొండి అధికారులు కలిసి జెరుబ్బాబెలుకు, యూదుల పెద్దలకు కష్టం కలిగించారు. వారు చెడ్డవారని, కేవలం రాజుపై తిరుగుబాటు చేసేందుకే యెరూషలేమును బాగు చేస్తున్నారని అర్తహషస్తకు ఉత్తరం వ్రాసారు. అర్తహషస్త మందిరపు పని ఆపుచేయాల్సిందిగా ఆజ్ఞాపించాడు (4:11-24) ఆ విధంగా క్రీ. పూ. 530-520 సం॥ వరకు పని పూర్తిగా నిలిచి పోయింది.

**2. ప్రవక్తల పరిచర్య :** తమకు ఎదురైన ఆటంకాలు ప్రజల్ని నిరుత్సాహ పర్చాయి. కనుక హగ్గయి మరియు జెకర్యా ప్రవక్తలు వారిని ప్రోత్సహించే సందేశాలనిచ్చారు. వారి వల్ల ప్రభావితమైన జెరుబ్బాబెలు మరియు యూదుల పెద్దలు (ఎజ్రా 4:28-5:17). క్రీ. పూ. 520, సెప్టెంబర్ 21వ తేదీన తిరిగి మందిరాన్ని కట్టనారంభించారు.

**3. మందిర నిర్మాణం పూర్తి చేయబడుట మరియు ప్రతిష్ఠించబడుట :** క్రీ.పూ. 522 లో అర్తహషస్త స్థానంలో అతని కుమారుడైన దర్యావేషు పర్షియాకు రాజయ్యాడు. హగ్గయి, జెకర్యాల ప్రోద్బలంతో మందిర నిర్మాణం తిరిగి కొనసాగుతూ ఉండగా మరలా కొంత మంది అధికారులు మీరు ఎవరి అనుమతితో కడుతున్నారని యూదులను ప్రశ్నించారు. వారు కోరెషు ఇచ్చిన ఉత్తరువులను గర్చి తెలియజేయగా, దర్యావేషు బబులోనులోని దస్తావేజులను వెదికి కోరెషు ఇచ్చిన ఆజ్ఞప్రతిని చదివి, యెరూషలేములోని మందిర

నిర్మాణానికి ఏలాంటి అభ్యంతరాలు కలుగకుండ చూడాలని రాజ్యాధికారులకు ఆజ్ఞాపించాడు (6:11–12). సాతాను మరియు మానవులు ఎన్ని ఆటంకాలు కలిగించినా దేవుడు తన కార్యాన్ని కొనసాగిస్తూనే ఉంటాడు. అందుకు దేవుడు అధికారులను రాజులను సహితం తన సాధనాలుగా వాడుకోగలడు.

ఈ విధంగా యూదుల పెద్దలంతా 4 సంవత్సరాలు శ్రమించిన తరువాత క్రీ. పూ. 516 సంవత్సరం మార్చి 12వ తేదీన దేవుని మందిర నిర్మాణం పూర్తయింది. యూదులంతా కలిసి ఎంతో వైభవంగా మందిరాన్ని ప్రతిష్టించారు. తమ్మును తాము దేవుని కొరకు ప్రతిష్ఠించుకొన్నారు. చాల కాలం తరువాత తిరిగి పస్కా పండుగను ఆచరించారు (6:20–21) ఈ సందర్భంలోనే 126వ కీర్తన వ్రాయబడింది.

**III. ఎజ్రా నాయకత్వంలో తిరిగి వచ్చిన యూదులు (ఎజ్రా 7-10 అధ్యా) :** దాదాపు మొదటి గుంపు వచ్చిన 60 సంవత్సరాలకు రెండవ గుంపు ఎజ్రా నాయకత్వంలో క్రీ.పూ. 458 సం॥ ఏప్రిల్ 8వ తేది బబులోను నుండి బయలుదేరి 4 నెలలు ప్రయాణం చేసి ఆగష్టు 4వ తేదీన యెరూషలేముకు చేరుకున్నారు. (7,8 అధ్యా). 7:10 లో ఎజ్రా జీవిత సారాంశం, అతని జీవిత లక్ష్యం కనిపిస్తుంది. 7:25లో ఎజ్రాకు దేవుని వాక్యం పట్ల గల ప్రేమను బట్టి రాజు ఎలా సంతోషించాడో వ్రాయబడింది. మన జీవితాల్ని చూసి ఇతరులు దేవుణ్ణి మహిమపర్చే విధంగా మనం జీవించాలి. అర్తహషస్త రాజుచే ఆదేశాన్ని పొంది. ఎజ్రాతో వచ్చినబృందంలో 1700 మంది యూదులు ఉన్నారు. (7:11–8:14) వారి ప్రయాణ ఖర్చులన్నీ రాజే భరించాడు. ఈ రాజే 13 సంవత్సరాల అనంతర యెరూషలేము ప్రాకార నిర్మాణానికి నెహెమ్యాకు అధికారాన్నిచ్చాడు.

1. **శాస్త్రియైన ఎజ్రా :** ఎజ్రా దేవుని ప్రజల కొరకు దేవుని ప్రణాళికలో తోడ్పడిన నాయకుడు. ఎజ్రా అనే పేరుకు అర్థం “సహాయము”. ఇతడు మోషే మరియు సమూయేలు వలె ఇశ్రాయేలు చరిత్రాధారాలను పొందుపరచి వ్రాసి వాటిని కాపాడడమే గాక ఇశ్రాయేలుజాతి ఉద్దేశాన్ని నెరవేర్చేందుకు దోహదపడినవాడు. బైబిలు గ్రంథాల ప్రమాణికతను గుర్తించిన వ్యక్తి.పాత నిబంధన గ్రంథాల ప్రమాణికతను నిర్ణయించేందుకు ఏర్పరచబడిన 120 మందికి ఇతడు అధ్యక్షునిగా ఉన్నాడని చరిత్ర తెలియజేస్తుంది.

   బబులోను చెరలో నున్న యూదుల మధ్య ఆరాధన కోసం సమాజ మందిరాలను ఎజ్రానే స్థాపించాడన్న అభిప్రాయం వుంది. ఒక ఆధ్యాత్మిక నాయకునిగా ప్రజలకు వాక్యాన్ని బోధించడమే కాకుండ I & II దినవృత్తాంతాలలో కొంత భాగాన్ని మరియు 119వ కీర్తనను కూడ రచించాడు. బైబిలును పఠించుటను గూర్చిన మహా ఉద్యమం ఇతని ఆధ్వర్యంలోనే నిర్వహించబడింది. అంత మాత్రమే కాదు భవిష్యత్తు కొరకు రాజ్యాంగ చట్టానికి పునాది వేసినాడు కూడ ఇతడే.

**2. ఉజ్జీవ కారకుడైన ఎజ్రా :** (9:1-10:44) : ఎజ్రా యెరూషలేముకు తిరిగి వచ్చేనాటికి పరిస్థితులు ఊహించిన దానికంటె చాల ఘోరంగా ఉన్నాయి. ప్రజలు విగ్రహారాధనవైపు తిరుగకున్నా అన్యులను వివాహం చేసికొన్నారు, వారి పద్ధతులన్నీ నేర్చుకొని పాటించారు. (9:1-4). వీరిలో పెద్దలు, అధికారులు కూడ ఉండడం శోచనీయం (9:2). ఈ పరిస్థితిని చూచి ఎజ్రా ఏడ్చాడు. బట్టలు చింపుకుని ఉపవాసముండి దేవుని సన్నిధిలో ప్రలాపించాడు (9:6-15). ఎజ్రాలో రగిలిన ఈ జ్వాల జనాంగాన్నంతటిని మండించనారంభించింది. వారు పశ్చాత్తాపంతో కుమిలిపోయారు (10:1-4). ఈ విధంగా ఓ గొప్ప ఆధ్యాత్మిక సంచలనం చెలరేగింది. ఎజ్రా మరియు యూదుల పెద్దలందరు కలిసి చెర నుండి విడుదల పొంది వచ్చిన వారందరినీ యెరూషలేములో సమకూర్చారు. అది యూదా చరిత్రలోనే మరపురాని ఉజ్జీవ సభ. కుండపోతగా కురుస్తున్న వర్షంలో ప్రజలు దినమంతా నిలువబడి దేవుని వాక్యాన్ని విన్నారు. వారి పొరపాటును సరిచేసుకొని తాము వివాహమాడిన అన్య స్త్రీలను పంపించివేసి నూతనంగా దేవునికి సమర్పించుకున్నారు. ఎజ్రా వారిచే తిరిగి దేవునితో నిబంధన చేయించాడు.

# గొప్ప పని
## (నెహెమ్యా గ్రంథ సంగ్రహ సమీక్ష)

**A. ఉపోద్ఘాతము :** నెహెమ్యా ఎజ్రాకు సమకాలికుడు. చెరలోని యూదుల పునరాగమనం మరియు దేవుని పట్టణమైన యెరూషలేము పునర్నిర్మాణంలో ప్రధాన పాత్రధారుల్లో నెహెమ్యా ఒకడు. ఎజ్రా ముగించిన విషయంతో నెహెమ్యా ప్రార్థన ప్రారంభమౌతుంది.

**1. గ్రంథకర్త :** నెహెమ్యా వ్రాసుకొన్న వ్యక్తిగత దినచర్య గ్రంథం నుండి ఎజ్రా సంగ్రహించి, నెహెమ్యా గ్రంథాన్ని సంకలనము చేసినట్లు చరిత్ర ఆధారాలున్నాయి. నెహెమ్యా అనే మాటకు యెహోవా ఓదార్పు అని అర్థం. ఇతడు పర్షియా దేశపు రాజైన అర్తహషస్త వద్ద గిన్నెనందించే వాడు (1:11) రాజుకు ప్రధాన సలహాదారుల్లో ఒకడు. దేవుని మందిరం పట్ల దేవుని ప్రజల పట్ల ప్రేమగలవాడు (1:3,4).

**2. కాలము :** క్రీ. పూ. 430 సంవత్సరంలో ఎజ్రా గ్రంథంతో పాటు వ్రాయబడియుండవచ్చును.

**3. సందర్భము :** ఎజ్రా ఇశ్రాయేలు ప్రజలను నైతికంగా, ఆధ్యాత్మికంగా సరిచేస్తున్న దినాలలో నెహెమ్యా కూడ యూదా రాజ్యాన్ని రాజకీయంగానూ, భౌగోళికంగాను తీర్చిదిద్దడంలో ప్రముఖ పాత్ర వహించాడు. ఆకాలంలోని యూదా చరిత్ర మరియు నెహెమ్యా పాత్ర నెహెమ్యా గ్రంథంలో వివరించబడింది.

## B. గ్రంథ విభజన :

### I. ప్రాకార పునర్నిర్మాణం (1-7 అధ్యా)

1. యెరూషలేములోని శేషం కొరకు నెహెమ్యా ప్రార్థన 1 అధ్యా.
2. నెహెమ్యా రాజుతో మనవి చేసికొనుట; యెరూషలేముకు తిరిగివచ్చుట; యెరూషలేము శిథిలాలను పరిశీలించుట (2:1-16).
3. ప్రాకార పునర్నిర్మాణం నిమిత్తం పురికొల్పుట 2:17-20.
4. ప్రాకారము మరియు గుమ్మాలు పునర్నిర్మించుట. 3 అధ్యా.
5. ఆటంకాలలో నెహెమ్యా ప్రతిస్పందన. 4-6 అధ్యా. ప్రాకార నిర్మాణం పూర్తగుట. 6:15.
6. నెహెమ్యా ప్రజల పేర్లు నమోదు చేయుట. 7 అధ్యా.

### II. ఉజ్జీవం మరియు సంస్కరణ. (8-13 అధ్యా)

1. ఎజ్రా ద్వారా నిర్వహించబడిన గొప్ప బైబిలు పఠన. 8 అధ్యా.
2. ఉజ్జీవం - ఫలితం. 9,10 అధ్యా.
3. సంస్కరణ - మరో ఫలితం. 11-13 అధ్యా.

## C. అంశాల వారిగా సంక్షిప్త వివరణ :

### I. నెహెమ్యా యెరూషలేముకు వచ్చుట (1-7 అధ్యా).

యూదులు బబులోను చెరలో ఉన్నప్పుడు జన్మించిన వాడు నెహెమ్యా. క్రీ. పూ. 465-424 లో పర్షియాను పరిపాలించిన అర్తహషస్త రాజు ఆస్థానంలో ఉన్నతమైన పదవిలో ఉన్నవాడు. అర్తహషస్త, ఎస్తేరును వివాహమాడిన అహష్వేరోషుకు వష్తి ద్వారా పుట్టిన 3వ కుమారుడు. ఎజ్రా, నెహెమ్యాలాంటి యూదులు అర్తహషస్త ఆస్థానంలో ఉన్నత పదవుల్లో ఉండడానికి ఎస్తేరు కారకురాలయి ఉండవచ్చు.

1. **దేవుని పట్ల దేవుని ప్రజలపట్ల నెహెమ్యాకు గలప్రేమ :** రాజుతో సన్నిహిత సంబంధంగల పదవిలో ఉంటూ కూడ దేవుని ప్రజలను నెహెమ్యా మరచిపోలేదు. తన ప్రజల కోసం రాజ భవనంలోని సౌభ్యాన్ని కూడ త్యాగం చేసిన వ్యక్తి. నెహెమ్యా యెరూషలేము స్థితిని గూర్చి తెలిసికొని ఎంతగానో విలపించాడు (1:3-11) ఉపవాసం ఉండి ప్రార్థించాడు. తన ప్రజల పక్షంగా వారి పాపాన్ని దేవుని సన్నిధిలో ఒప్పుకొన్నాడు. భారంతో చేసిన ప్రార్థనను బట్టి దేవుడతనికి ఒక దర్శనాన్నిచ్చాడు.

   కాని రాజాజ్ఞ లేకుండ అతడు తిరిగి వెళ్ళలేదు. అయితే దేవుడే సమస్తము సమకూర్చి జరిగించాడు. రాజు నెహెమ్యాకు యెరూషలేము ప్రాకారాన్ని కట్టేందుకు అనుమతి నివ్వడమే కాకుండ, అందుకు కావలసిన వస్తుసామాగ్రిని, దూలములను, మ్రానులను ఇవ్వాల్సిందిగా తన ఆటవీశాఖాధికారులకు ఆజ్ఞాపించాడు. ఈ విధంగా అర్తహషస్త రాజు కాలంలో క్రీ.పూ.

445 సం॥ ఆగస్టు నెలలో నెహెమ్యా యెరూషలేముకు వచ్చాడు. అతని రాకను బట్టి కొంతమంది సంతోషించారు, కొంతమంది దుఃఖించారు.

## II. ప్రాకారపు నిర్మాణం :

యూదులు బబులోను నుండి తిరిగి వచ్చి దాదాపు 100 సం॥ గడిచిపోయినా, దేవుని మందిరాన్ని తప్ప యెరూషలేము పట్టణాన్ని పునర్నిర్మించుకోలేక పోయారు. నెహెమ్యా వచ్చేసరికి ఎజ్రా 13 సంవత్సరాలుగా అక్కడే ఉన్నాడు.

నెహెమ్యా దృఢ నిశ్చయంతో తాను తలపెట్టిన పని కొరకు సిద్ధపడ్డాడు. రాత్రిపూట లేచి తనతో కొంతమందిని తీసుకొనివెళ్ళి యెరూషలేము గోడలను పరీక్షించాడు. తరువాత యూదులకు ఒక పిలుపు నిచ్చాడు. (2:17-18). నెహెమ్యారాకతో యూదుల చరిత్ర మరో ప్రాముఖ్యమైన మలుపు తిరిగింది. ప్రజలందరూ ఏక మనస్సుతో యెరూషలేము ప్రాకారాలను తిరిగి కట్టేందుకు తీర్మానించుకున్నారు. సన్బల్లటు, టోబీయా అనేవారు నెహెమ్యాను హేళన చేసారు. కాని అతడు ఏ మాత్రం వెనుకాడలేదు.

3వ అధ్యాయంలో ఒక ప్రత్యేక విషయాన్ని గమనించాలి. ఎవరి ఇంటికి సమీపంలో ఉన్న గోడను వారు కట్టడం ప్రారంభించారు. కేవలం 52 రోజుల్లో ప్రాకారం పునర్నిర్మించబడడంలో రహస్యం ఏమంటే ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను హృదయ పూర్వకంగా నిర్వర్తించారు.

1. **ప్రాకార నిర్మాణానికి ఎదురైన అడ్డంకులు :** మొదట యూదులకు శత్రువులైన సమరయులు పనిని ఆటంకపర్చారు. సబ్బలటు టోబియా ఎగతాళి చేసి, బెదిరించినా వారు తమ పనిలో సాగి పోవడం చూచి, కోపంతో మండిపడి యెరూషలేము మీదికి యుద్ధానికి బయలు దేరారు. (4:8). నెహెమ్యా ప్రజలను రెండు గుంపులుగా చేసి, ఒక గుంపు పని చేస్తుండగా మరో గుంపును కాపలాగా నియమించాడు. ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉన్నారు ఒక చేత్తో పని చేస్తూ మరో చేత్తో ఆయుధాన్ని ధరించారు.

2. **అంతరంగిక సమస్య :** 5వ అధ్యాయానికొచ్చేసరికి యూదులలోనే ఒక అంతరంగిక సమస్య మొదలైంది. యూదులలో కొందరు పెద్దలు అధికారులు పేదలను వడ్డీ వ్యాపారం ద్వారా దోచుకుంటున్నారు. అప్పు తీర్చలేని పేదల పొలాలను పశువులను తమ స్వంతం చేసుకుంటున్నారు. కనుక సెహెమ్యా వారిని సమకూర్చి వాక్యాధారంగా వారిని గద్దించాడు. (5:8; నిర్గ 22:25, లే.కా 25:36). వెంటనే ప్రతి ఒక్కరు తాము ఆక్రమించుకున్న ఆస్తుల్ని తిరిగి ఇచ్చేందుకు సిద్ధపడ్డారు. నెహెమ్యా యెరూషలేములో 12 సంవత్సరాలు గవర్నరుగా పని చేసాడు. కాని అతడు గాని అతనితో పనిచేస్తున్నవారుగాని రాజు నుండి ఎటువంటి వేతనాలు తీసికోకుండ పని చేసారు. (5:14). నెహెమ్యా తాను నమ్మిన దాన్ని

తన జీవితంలో అమలు పర్చాడు గనుక అతని జీవితం అనేకుల్ని ప్రభావితం చేసింది సన్బల్లటు, టోబీయా కుయుక్తులలో దేవుని జ్ఞానంతో, మెళకువతో వ్యవహరించాడు నెహెమ్యా (6:2–3). మరో వైపు యూదులే అన్యులతో వియ్యమంది వారితో చేతులు కలిపి నెహెమ్యాకు వ్యతిరేకంగా పని చేసినా (6:14) నెహెమ్యా దేవునిపై ఆధారపడి ప్రాకార నిర్మాణాన్ని పూర్తి చేసాడు. 7వ అధ్యాయంలో యెరూషలేముపై హనన్యా అధికారిగా నియమించబడడం, జన సంఖ్య చేయబడడం చూస్తాము. 7,337 మంది పనివారు, 245 మంది గాయనీగాయకులు కాక మొత్తం జన సంఖ్య 42, 36 మంది.

## II. నెహెమ్యా ప్రజల నైతిక జీవితాన్ని పునరుద్ధరించుట (8–13 అధ్యా) :

8–10 అధ్యాయాలలో యూదా ప్రజల్లో రగిలించిబడిన మరో ఉజ్జీవాన్ని గూర్చి వ్రాయబడింది. అది కూడ దేవుని వాక్యం ద్వారానే కలిగింది (8:1). ఎజ్రా నెహెమ్యా మలాకీ ఈ ముగ్గురు దైవజనులు ప్రజలను ఉజ్జీవింపజేసారు. వీరు యెరూషలేములోని యూదులందర్నీ నీటి గుమ్మానికి ఎదురుగా ఉన్న మైదానంలో సమకూర్చారు. ఓ ప్రక్కన నిర్మించబడిన ప్రసంగ వేదిక నెక్కి ఎజ్రా ధర్మశాస్త్రాన్ని చదివి ప్రజలకు వినిపించాడు (8:5–6). అతని సహాయకులు ప్రజల మధ్య సంచరిస్తూ వారికి అర్థం కాని విషయాలను వివరిస్తూ వచ్చారు. కొన్ని వేల మంది ప్రజలు నిశ్శబ్దంగా ఆలకిస్తున్నారు.

అంతలో ఆ మహా సమాజంలో నుండి రోదన శబ్దం బిగ్గరగా వినబడింది. ప్రజలు పశ్చాత్తాపంతో దేవుని సన్నిధిలో తమ పాపాలను ఒప్పుకొన్నారు. 9వ అధ్యాయం 5వ వచనం నుండి చివరి వరకు వారు చేసిన ప్రార్థన వ్రాయబడింది. దేవుడు వారికి గతంలో చేసిన మేళ్ళను జ్ఞాపకం చేసికొన్నారు. దేవునికి దూరమైనందుకు దుఃఖించారు. దేవుని తీర్పులు న్యాయమైనవని గ్రహించారు (9:33; కీర్త 119:75).

చెరకు పూర్వం ఎంతమంది ప్రవక్తలచే హెచ్చరించబడినా విగ్రహారాధనను మానని యూదులు చెర అనుభవం తరువాత మానివేసినా అన్యులతో వివాహాలను మాత్రం మానలేదు. నిజమైన పశ్చాత్తాపము అంటే పాపాన్ని ఒప్పుకోవడం మాత్రమే కాదు దాన్ని విడి పెట్టాలి. 10వ అధ్యాయంలో ప్రజలు తీసికొన్న ఆలాంటి నిర్ణయాలను గూర్చి వ్రాయబడింది. మొదటగా వారు దేవుని ధర్మశాస్త్రాన్ని అనుసరించి నడుచుకొంటామని శపథం చేసారు (10:28) తరువాత వివాహం విషయంలో పవిత్రంగా ఉండేందుకు (10:30–31) దశమ భాగాలు, ప్రథమ ఫలాలు క్రమంగా ఇచ్చేందుకు (10:36,37) తీర్మానం చేసికొన్నారు. అందరు కలసి వారి తీర్మానాలన్నీ ఒక గ్రంథంలో వ్రాసి అందరి అంగీకారానికి గుర్తుగా ముద్రలు వేసారు. మా దేవుని మందిరాన్ని విడిచిపెట్టము అని వాగ్దానం చేసారు (10:39).

## III. యెరూషలేము ప్రాకార ప్రతిష్ఠ (11:1-12:47) :

11వ అధ్యాయంలో యెరూషలేము పట్టణంలోపల నివసించినవారి పేర్లు వారి సంఖ్య, 12:1-11 లో జెరుబ్బా బెలుతో యెరూషలేముకు వచ్చిన వారి పేర్లు ప్రస్తావించబడ్డాయి. 12:12-26లో రాజైన యెహోయాకీము కాలం నుండి నెహెమ్యా కాలం వరకు పని చేసిన యాజకుల, లేవీయుల వంశావళులు వ్రాయబడ్డాయి. 12:27-47 లో యెరూషలేము ప్రాకార ప్రతిష్ఠను గూర్చి వ్రాయబడింది. యెరూషలేము నుండి దాని చుట్టు ప్రక్కల ప్రాంతాల నుండి తండోపతండాలుగా ప్రజలు తరలి వచ్చారు. ప్రతిష్ఠతకు ముందు గాయకులు, లేవీయులు, పెద్దలు, యాజకులు తమ్మును తాము పవిత్రపరచుకున్నారు. పెద్దలు గాయకులు రెండు బృందాలుగా ఎజ్రా, నెహెమ్యాల నాయకత్వంలో స్తుతి గీతాలు పాడుతూ ఉండగా రెండు వైపుల నుండి ప్రజలందరు ప్రాకారం చుట్టు తిరిగి మందిరం వద్ద కలుసుకోవడ కమనీయమైన దృశ్యం. (12:43). ప్రజలంతా హృదయపూర్వకంగా దేవుణ్ణి వెంబడించేందుకు తీర్మానించుకున్నారు.

12:44-47 లో దేవుని మందిర సేవ కొరకు చేయబడిన ఆర్థిక సంబంధమైన ఏర్పాట్లను గూర్చి దేవుని సేవకుల పోషణను గూర్చి వివరంగా వ్రాయబడింది.

## IV. దేవుని ప్రజల పునః ప్రతిష్ఠ (13 అధ్యా) :

13:1-3లో అన్యులను, మిశ్రమ జన సమూహాన్ని ఇశ్రాయేలీయులలో నుండి వెలివేసినట్లు చూడగలం. దేవుని ఆజ్ఞల పట్ల వారికున్న ఆసక్తి అంత గొప్పది. నెహెమ్యా 12వ అధ్యాయానికి 13వ అధ్యాయానికి మధ్య కనీసం 20 సంవత్సరాల వ్యవధి ఉంది. 13:4 నుండి నెహెమ్యా రెండవ సారి గవర్నరుగా నియమించబడి వచ్చిన తరువాతి విషయాలున్నాయి. నెహెమ్యా యెరూషలేములో లేని కాలంలో మలాకీ ప్రవక్త ప్రజలకు దేవుని వర్తమానాలనందించాడు. కాలక్రమాన్ని బట్టి చూస్తే మలాకీ గ్రంథం నెహెమ్యా 12, 13 అధ్యాయాలు మధ్య ఉండాలి. కాని పాత నిబంధనలో చివరిలో ఉంచబడింది.

నెహెమ్యా కాలంలో ప్రజలు ఎంతో ఉజ్జీవింపబడ్డారు కాని అతడు షూషనుకు వెళ్ళి క్రీ. పూ. 425 లో తిరిగి వచ్చే సరికి పరిస్థితులన్నీ తారుమారయ్యాయి. కనుక నెహెమ్యా మరోసారి సంస్కరణ చెయ్యాల్సివచ్చింది. టోబియా అన్యుడైనా, యూదులతో వియ్యమంది నందువలన అనేకులు అతని పక్షంగా చేరారు (6:17,18) యాజకుడైన ఎల్యాషీబు బంధు ప్రీతితో టోబియాకు దేవుని మందిరంలోనే ఒక గదిని ఏర్పాటు చేసాడు. నెహెమ్యా అతన్ని సరిచేసి, టోబియాను వెళ్ళగొట్టాడు (13:7,8). ఆలాగే లేవీయుల పోషణార్థం చెందాల్సిన దశమభాగం విషయం గద్దించాడు (13:10-12). గతంలో విశ్రాంతి దినాన్ని నిర్లక్ష్యం చేసిన విషయాన్ని జ్ఞాపకం చేసి ఆ దినాన వ్యాపారం జరుగకుండ యెరూషలేము కోట

గుమ్మాలను మూసి ఉంచాల్సిందిగా ఆజ్ఞాపించాడు (13:17-18). అన్యులతో విద్యుమందినవారిని యెరూషలేమునుండి పంపించి వేసాడు.

**దేవుని పని - దేవుని సూత్రాలు - పద్ధతులు :**

ఈ రెండు గ్రంథాలలోను దేవుని పని, దానికై దేవుని సూత్రాలు మరియు పద్ధతులను గమనిద్దాం.

1. దేవుడే తన కార్యానికి మూలకర్త అని మనం ఆయన సాధనాలని గమనించాలి. (ఎజ్రా 1 అధ్యా; నెహె 1 అధ్యా; యోహా 15 అధ్యా; రోమా 11:36). ఆయనే మూలశక్తి. మన ద్వారా తన కార్యం జరిగించడం ద్వారా ఆయన మహిమ పర్చబడాలన్నదే ఆయన ముఖ్య ఉద్దేశం.
2. దేవుడు తన పని జరిగించేందుకు వాడుకొనే మానవ సాధనాలకు స్పష్టమైన నడిపింపునిస్తాడు.
3. తన కార్య సిద్ధికై కావలసినవన్నీ సిద్ధం చేస్తాడు, అనుకూల పరుస్తాడు. - (ఎజ్రా 1:4, 6-11; నెహె 2:8; మత్త 6:33). ఊహించని రీతిగా సమస్తం సమకూరుస్తాడు (ఎజ్రా 7:27, 28, ఎఫె 3:20).
4. దేవుని కార్యం చేస్తున్నప్పుడు సాతాను పన్నాగాలను కూడ తప్పకుండా ఎదుర్కోవలసి ఉంటుంది. (ఎజ్రా 3:10-13). బయటి నుండి (ఎజ్రా 4:4,5; నెహె 2:19; 4:1,2, 13-15) లోపలి నుండి (ఎజ్రా 4:1-3) సమస్యలెదురౌతాయి.
5. తన పనికి మూలమైయున్న దేవుడు తన నడిపింపు, అనుకూలతలతో పాటు ప్రతి ఆటంకాన్ని తొలగిస్తాడు. (ఎజ్రా 5, 6 అధ్యా). కనుక దేవుని అదృశ్య హస్తాన్ని చూస్తూ ఆటంకాలను జయించాలి.
6. దేవుని పని చేసే ప్రతినిధులు దేవుని సంకల్ప సిద్ధికై విశ్వాస సూత్రాలను పాటించాలి. (ఎజ్రా 8:21-23).

## ముగింపు :

ప్రియ పాఠకులారా! ఆనాటి సమాజానికి ఎజ్రా, నెహెమ్యాల లాంటి నాయకులు, సంస్కర్తలు ఎంత అవసరమో ఈనాటి సంఘ నిర్మాణంలోను అంతే అవసరం. అయితే దేవుని ప్రణాళిక నెరవేర్పుకై ఆయన చేతి సాధనాలుగా వాడబడాలన్న ఆశ ప్రతి విశ్వాసికి ఉన్నప్పుడే అది సాధ్యం అవుతుంది. మీరున్న ప్రాంతంలో, సంఘంలో, సమాజంలో పరిస్థితులెలా ఉన్నాయి? మీ సంఘాన్ని పునరుద్ధరించాల్సిన అవసరత ఉందా? సంఘంలో ఉజ్జీవ జ్వాలలను రగిలించాల్సిన ఆవశ్యకత ఉందా? సంఘంలోని అవినీతిని రూపుమాపాలని కోరుతున్నారా? ఇప్పుడే ఆ పనిని ప్రారంభించండి. ఎజ్రా, నెహెమ్యాల వలె ప్రార్థించండి. దేవుని హస్తాల్లోకిరండి. దేవుని వాక్యం ద్వారా ఉజ్జీవాన్ని కలిగించండి. ప్రజల్లో పాపాన్ని గూర్చిన పశ్చాత్తాపాన్ని కలిగించి వారి జీవితాల్ని సంస్కరించండి. దైవాశీస్సులు.

## ఎజ్రా మరియు నెహెమ్యా కాలంలో జరిగిన సంఘటనల క్రమము

| కాలము | సంఘటన | వాక్యాధారము |
|---|---|---|
| 1. క్రీ.పూ. 539, అక్టోబర్ 12వ తేది | బబులోనుపై పర్షియా దాడి, ఆక్రమణ | దాని 5:30 |
| 2. క్రీ.పూ. 538, మార్చి 24వ తేదీ నుండి | | |
| 3. క్రీ.పూ.537, మార్చి 11 తేదీ వరకు | కోరెషు పాలనలో మొదటి సంవత్సరం | ఎజ్రా 1:1-4 |
| 4. క్రీ.పూ.537 సం॥ | జెరుబ్బాబెలు, షేష్బజ్జరు నాయకత్వంలో యూదులు యెరూషలేముకు వచ్చుట | ఎజ్రా 1:11 |
| 5. క్రీ.పూ. 537 సం॥ | బలిపీఠం నిర్మించబడుట | ఎజ్రా 3:1 |
| 6. క్రీ.పూ. 536 సం॥ | దేవాలయ పునర్నిర్మాణం ప్రారంభం | ఎజ్రా 3:8 |
| 7. క్రీ.పూ. 536-530 సం॥ | కోరెషు కాలంలో దేవాలయ పునర్నిర్మాణానికి వచ్చి వ్యతిరేకత | ఎజ్రా 4:5 |
| 8. క్రీ.పూ. 530-520 సం॥ | దేవాలయ నిర్మాణం నిలిచిపోవుట | ఎజ్రా 4:24 |
| 9. క్రీ.పూ. 520, సెప్టెంబర్ 21వ తేదీ | దర్యావేషు పాలనలో దేవాలయ పునర్నిర్మాణం కొనసాగుట | ఎజ్రా 5:2; హగ్గ 1:4 |
| 10. క్రీ.పూ.458, ఏప్రిల్ 12వ తేదీ | దేవాలయ నిర్మాణం పూర్తగుట | ఎజ్రా 6:15 |
| 11. క్రీ.పూ.458, ఏప్రిల్ 8వ తేదీ | ఎజ్రా బబులోను నుండి బయలుదేరుట | ఎజ్రా 7:7 |
| 12. క్రీ.పూ.458, ఆగష్టు 4వ తేదీ | ఎజ్రా యెరూషలేముకు చేరుట | ఎజ్రా 7:8-9 |
| 13. క్రీ.పూ.458, డిసెంబరు 19వ తేదీ | యూదులందరు యెరూషలేములో సమకూడుట | ఎజ్రా 10:9 |

| కాలము | సంఘటన | వాక్యాధారము |
|---|---|---|
| 14. క్రీ.పూ.458, డిసెంబరు 29వ తేదీ | అన్యస్త్రీలను వివాహమాడిన వారిని గూర్చి యూదా పెద్దలు విచారించుట | ఎజ్రా 10:16 |
| 15. క్రీ.పూ.457, మార్చి 27వ తేదీ | అన్యస్త్రీలను వివాహమాడిన యూదుల జాబితా | ఎజ్రా 10:17 |
| 16. క్రీ.పూ.445, ఏప్రిల్ 13వ తేదీ నుండి క్రీ.పూ. 444, ఏప్రిల్ 2వ తేదీ వరకు | అర్తహషస్త పాలనలో 20వ సం॥ | నెహె 1:1 |
| 17. క్రీ.పూ. 445, మార్చి | అర్తహషస్తరాజు సముఖంలో నెహెమ్యా | నెహె 2:1 |
| 18. క్రీ.పూ. 445, ఆగష్టు | నెహెమ్యా యెరూషలేముకు చేరుకొనుట | నెహె 2:11 |
| 19. క్రీ.పూ.445, అక్టోబర్ 2వ తేదీ | యెరూషలేము ప్రాకార నిర్మాణము పూర్తగుట | నెహె 6:15 |
| 20. క్రీ.పూ. 445, అక్టోబర్ 8వ తేదీ నుండి క్రీ.పూ. 445, నవంబర్ 5వ తేదీ వరకు | యెరూషలేములో యూదుల సమావేశం | నెహె 7:73-8:1 |
| 21. క్రీ.పూ. 445, బర్ 22-28 | పర్ణశాలల పండుగ | నెహె 8:14 |
| 22. క్రీ.పూ.445 అక్టోబర్ 30వ తేదీ | యూదుల జాతీయ ఉపవాస దినం | నెహె 9:1 |
| 23. క్రీ.పూ. 433, ఏప్రిల్ 1 నుండి క్రీ.పూ.432 ఏప్రిల్ 19వ తేదీ వరకు | అర్తషస్త పరిపాలనలో 32వ సంవత్సరంలో నెహెమ్యా తిరిగి షూషను కోటకు పిలువబడుట | నెహె 5:14; 13:6 |

**TTB - Telugu - Study Outlines - The books of Ezra & Nehemaiah**
Printed by : Premadhara, Trans World Radio - India, 12-1-334/17/3,
Lalapet, Secunderabad - 500 017. Ph : 040-27003011.

**FREE** MP3 DOWN LOAD - Log on to :
**www.radio882.com**